ఈ-కేవైసీ ఉంటేనే ఉపాధి

- శ్రామికుల ముఖ, కంటిపాపల నమోదు
- అక్రమాల నిర్మూలనకు నూతన సంస్కరణలు
- నవంబర్ నుంచి పక్కా నిబంధనలు

తుని రూరల్: జాబ్ కార్డు ఒకరి పేరుతో ఉండగా..వారికి బదులు మరొకరు హాజరైనట్లు చూపి అక్రమాలకు పాల్పడే పరిస్థితి ఇక ఉపాధి హామీ పథకంలో ఉండకుండా కట్టడి చేస్తు కేంద్ర ప్రభుత్వం మరో కొత్త విధానాన్ని ప్రవేశ పెడుతోంది. శ్రామికుల ఈ-కేవైసీ తీసుకుని ఆధార్‌కు అనుసంధానం చేస్తారు.

ఈ విధానంలో ఒకరి తరపున మరొకరు హాజరైతే యాప్ అనుమతించదు. ఒక్కో రాష్ట్రంలో రెండు జిల్లాలను ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా అక్టోబరు 1 నుంచి ఈ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర గామీణాభివృద్ధి మంతత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ-కేవైసీలో నమోదైన ముఖాలు, కనురెప్పులకు క్షేత్రస్థాయిలో శ్రామికుల ఫొటోలు సరిపోలితేనే రోజువారి మస్తరు నమోదవుతుంది.



డి.పోలవరంలో ఈ-కేవైసీ నమోదు చేస్తున్న ఎఫ్ఏ గాంధీ



కేపీ మల్లవరంలో ఈ-కేవైసీ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఏపీఓ రాజ్‌గోపాల్

నియోజకవర్గంలో పరిస్థితి..

తుని నియోజకవర్గం మూడు మండలాల పరిధిలో ఉన్న 62 పంచాయతీల్లో జాబ్‌కార్డులలో 60619 మంది ఉపాధి శ్రామికులుగా నమోదై ఉన్నారు. వీరిలో 23719 (39 శాతం) మందికి ఈ-కేవైసీ పూర్తయ్యింది. 36900 (61 శాతం) మందికి ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉంది. ప్రధానంగా ఉపాధి పథకంలో అక్రమాలు అరికట్టే సంస్కరణల్లో భాగంగా ఈ-కేవైసీ సాంకేతిక విధానాన్ని అమలు చేసేందుకు రంగం సిద్ధమైంది.

నమోదులో జాప్యం

వాస్తవానికి అక్టోబరు నుంచి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ఈ-కేవైసీ నమోదులో జాప్యం జరగడంతో నవంబరు నుంచి పటిష్ఠంగా అమలు చేసేందుకు అధికారులు సన్నహాలు చేస్తున్నారు. కొద్దిరోజులుగా మేట్ల సహాయంతో ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో తిరుగుతూ కూలీలకు ఈ-కేవైసీ చురుగ్గా చేస్తున్నారు. ఈ పనులను ఏపీఓలు గ్రామాల్లో పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్నారు.

మండలాలు వారీగా సమాచారం

మండలం	పంచాయతీలు	శ్రామికుల సంఖ్య	ఈకేవైసీ	పూర్తైన శాతం
తుని	23	23346	8807	37.72 శాతం
కోటనందూరు	17	19133	10135	52.97 శాతం
తొండంగి	22	18140	4777	26.33 శాతం
మొత్తం	62	30619	23719	39 శాతం

గత ప్రభుత్వంలో చర్యలు

2009లో ప్రారంభమైన మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కూలీల వలసలు నివారించి, ఉన్న ఊర్లోనే ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈపథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. సాంకేతిక పర్యవేక్షణ లేకపోవడం, రాజకీయ జోక్యంతో క్షేత్రస్థాయిలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా చెరువులు, కాలువల్లో పూడిక తీత, నీరు చెట్టు, ఇతరేతర నిర్మాణ పనుల్లో కొంతమేరకు పనులు చేయకుండానే మస్తర్లు వేసుకుని అక్రమాలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీల్లో ఆయా బృందాలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో అక్రమాలను అరికట్టేందుకు పలు సంస్కరణలు, మార్పులు చేస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ లక్ష్యాలను తుంగలోకి తొక్కి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకాన్ని వినియోగించి గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్లు (వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భారత్ నిర్మాణ్ సేవా కేంద్రాలు) నిర్మించడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు రూ.వందల కోట్లు ఆస్తులు సమకూర్చారు.

ఈ-కేవైసీ తప్పనిసరి



అక్రమాలకు, తావులేకుండ ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని నవంబరు నుంచి అమలు చేయనుంది. ఇతరులు ఎవరు పాల్గొన్న క్షేత్రస్థాయిలో ఆన్‌లైన్ ఫొటో గుర్తింపులో మస్తరు కోల్పోతారు. ఈ-కేవైసీలో నమోదై ఉపాధి పనుల్లో పాల్గొనే శ్రామికులకు 15 రోజుల్లోను రోజువారి వేతనాలు ఆయా బ్యాంకు ఖాతాలకు జమవుతాయి.

-పసుపులేటి నారాయణరావు, ఏపీఓ, తుని మండలం

క్లుప్తంగా

బాధితుడికి తోట ఆర్థిక సాయం



బాధితుడుకి ఆర్థిక సాయం అందిస్తున్న తోట నరసింహం

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన అల్లు కృష్ణకు మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం గురువారం ఆర్థిక సాయం, వీల్‌చైర్‌ను అందచేశారు. కృష్ణ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. బాధితుడిని గురువారం తోట నరసింహం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట రాంజీ, రాష్ట్ర పబ్లిసిటీ విభాగం జనరల్ సెక్రటరీ రామకుర్తి జగాల్, మండల పార్టీ అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, కరుటూరి వీర్రాజు, గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్, పార్టీ నేతలు పాలచర్ల వెంకన్న చౌదరి, కాకి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై బాలికలకు అవగాహన



తామరాడ పాఠశాలలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న బాలికలు

కిర్లంపూడి: బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తామరాడ పాఠశాల హెచ్ఎం ఎల్.కృష్ణ తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని తామరాడ జడ్పీహెచ్ పాఠశాలలో శిశు సంక్షేమ శాఖ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ఆధ్వర్యంలో 11 నుంచి 15 లోపు బాలికలకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ నేరాలు, రక్తహీనత, ఆడపిల్లల పట్ల లింగ వివక్షత, బాల్యవివాహాలు, బాలికల హక్కులు, పరిరక్షణ వంటి పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. సూపర్‌వైజర్లు పి.చంద్రకళ, ఎస్. కరీమున్నిసా, జీఎంఎస్‌కే కె. అరుణ పోటీలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు.

కాంగ్రెస్ సంతకాల సేకరణ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నీరుకొండ సత్యనారాయణ

ఏలేశ్వరం: కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా అవకతవకలకు పాల్పడిందని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ అగ్ర నాయకుల ఆరోపణల నేపథ్యంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా నమోదులో అవకతవకలపై ప్రజల నుంచి సంతకాల సేకరించారు. ఈ నెల 15 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఇన్‌చార్జి తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

400 మందికి కంటి పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

కిర్లంపూడి: రామచంద్రపురంలోని తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. జగ్గంపేటకు చెందిన శ్రీచరణ్ ప్రాథమిక ఆసుపత్రి వైద్యులు 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శిబిరంలో కాకినాడ మెడ్వే మల్టీస్పెషలిటీ వైద్యులు పలువురికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు.

నిష్పత్తి ఆధారంగా పురుగు మందులు వాడాలి

కోటనందూరు: వరిసాగులో తెగుళ్ల నివారణకు మిత్ర, శత్రు పురుగుల గుర్తింపు కీలకమని వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు కేజే చంద్రశేఖర్ అన్నారు. అల్లిపూడిలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తి ఆధారంగా పుతరుగు మందులు వాడాలన్నారు. వరిని ఆశించే తెగుళ్లు, తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వరిపొలంలో శత్రు, మిత్ర పురుగుల గుర్తింపుపై సిబ్బంది, రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీటీఎం బాబూరావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్రగడ గిరిబాబు పరామర్శలు



వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: నియోజకవర్గంలో ఇటీవల మృతిచెందిన పలువురు కుటుంబ సభ్యులను గురువారం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. పట్టణంలో ఇటీవల మృతిచెందిన వ్యాపారవేత్త మలకల వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను గిరిబాబు పరామర్శించారు. వెంకటేశ్వరరావు కుమారులు మలకల సూర్యారావు, మలకల చిన్ని, మలకల వేణులను పరామర్శించి సానుభూతి తెలిపారు. వెంకటేశ్వరరావు ఆకాల మరణం తీరని లోటని గిరిబాబు అన్నారు. ఆయన వెంట పార్టీనేతలు శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, కోరాడ ప్రసాద్, వాగు బలరామ్, లోగిసు శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్తిపాడు మండలం శరభవరంలో ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతిచెందిన మాజీ సర్పంచ్ అటికే సత్యవతి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. సత్యవతి మృతి పార్టీకి తీరని లోటని గిరిబాబు అన్నారు. కార్యక్రమంలో రామిశెట్టి నాని, రామిశెట్టి దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ కరవు



ప్రభుత్వాసుపత్రి వద్ద నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

ఏలేశ్వరం: ప్రయాణికులకు నిలువ నీడ కల్పించేందుకు పట్టణంలో దాతలు నిర్మించిన బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద దాతలు షెల్టర్‌లు నిర్మించారు. దీనికి ఆలనాపాలన లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. పేరుకుపోవడంతో లోపలికి వేళ్లేందుకు ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో ప్రయాణికుల సౌకర్యార్థం దాతలు నిర్మించారు. మున్సిపాల్టీ అధికారులు వీటిని పరిశుభ్రం చేస్తే ప్రయాణీలకు ఉపయోగపడుతుందని, దాతల ఆశయం నేరవేరుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

చెరువు ఉధృతికి రోడ్డు ధ్వంసం



చెరువు నుంచి ఉబికి ఉధృతంగా ప్రవహిస్తున్న సాగునీరు

ముంపుబారిన పొలాలు

తుని రూరల్: ఎస్.ఎస్.వి.నగరం పెద్ద చెరువు స్లూయిజ్ శిధిలమవడంతో సాగునీరు వృధాగా రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తుంది. రెండు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు స్పందించకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిధిలమైన స్లూయిజ్ నుంచి పైకి ఉబికి సాగునీరు తుని నుంచి కొట్టాం వెళ్లే ప్రధాన రహదారిపై వంద మీటర్ల వరకు ప్రవహిస్తూ రోడ్డును కోతకు గురిచేస్తూ పంట పొలాల్లోకి చేరుతుంది. దీంతో పంటపొలాలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో పెద్ద మొత్తంలో సమీపం కొండల నుంచి చెరువులోకి, చెరువు నుంచి రోడ్డుమీదగా పంటపొలాలకు వరదనీరు చేరుతుంది. అధికారులు స్పందించకపోతే స్లూయిజ్ మరింత ధ్వంసమై చెరువు గట్టుకు గండి పడే ప్రమాదం ఉందని, తుని నుంచి ఎన్.సూరవరం మీదుగా కోటనందూరు మండలంలో గ్రామాలకు వెళ్లే మార్గంలో రాకపోకలు స్తంభించిపోతాయని వాహనదారులు, సమీప గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కోటేశ్వరరావు సేవలు మరువలేనివి



సభలో ప్రసంగిస్తున్న విశ్రాంత ఎంఈఓ సుబ్రహ్మణ్యం

ప్రత్తిపాడు: ఉపాధ్యాయుడిగా, సంఘ సేవకునిగా బర్రే కోటేశ్వరరావు అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ, యోగా గురువు బర్రే కోటేశ్వరరావు మృతి చెందిన సంగతి తెలిసిందే. ప్రత్తిపాడులో గురువారం ఆయన వర్ధంతి సభ సందర్భంగా విశ్రాంత మండల విద్యాశాఖాధికారి ముక్కు సుబ్రహ్మణ్యం, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారుడు దొడ్డిపట్ల సోమన్నదొర, హిందూ ధర్మరక్షణ సమితి నాయకుడు కర్రి ధర్మరాజు, చుక్కల సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యానికి మేలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ

గండేపల్లి: పౌష్టికాహారం ఆరోగ్యానికి మేలుచేకూరుస్తుందని సీడీపీఓ ఎం.పూర్ణిమ అన్నారు. మండలంలోని గండేపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పలువురు గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లులు తీసుకోవాల్సిన పోషకాలు, జాగ్రత్తల గురించి వివరించి పోషకాహార స్టాల్స్‌ను పరిశీలించారు.

అనంతరం గర్భిణులకు పసుపు, కుంకుమ, గాజులు, చీర, ఫ్రూట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగపార్వతి, అంగన్‌వాడీ సెక్టార్ పరిధి కార్యకర్తలు, గ్రామస్తులు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి సత్యదీక్షల మాలధారణ



గెద్దనాపల్లిలో సత్యదీక్ష ప్రచారం నిర్వహిస్తున్న కృష్ణబాబు, సభ్యులు

కిర్లంపూడి: సత్యదీక్షను చేపట్టి దేవుని కృపకు పాత్రులు కావాలని సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు కోరారు. మండలంలోని కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం, వేలంక గ్రామాల్లో గురువారం సత్యదీక్ష ప్రచారం నిర్వహించి, దీక్ష విధివిధానాలపై భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అన్నవరం సత్యన్నారాయణస్వామి దేవస్థానంలో మాలధారణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడేల రాజారావు, దాడి సత్యన్నారాయణ, పొలిమేరు వీరప్రభావతి, అడారి అరుణ, మద్దాల లక్ష్మీదుర్గ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

తొండంగి: మండలంలోని రావికంపాడులో మురికి కాలువల పూడిక తీయకపోవడంతో పారిశుధ్యం తాండవం చేస్తోంది. కాలనీలు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గ్రామంలోని బీసీ కాలనీ, ఎస్సీపేట, ఓసీ కాలనీ, పాత ఊరు ప్రాంతాల కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా పేరుకుపోయింది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దోమల బెడద మరింత ఎక్కువగా ఉందని రోగాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి మురికికాలువలు పూడిక తీయించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రావికంపాడు బీసీ కాలనీ కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

కాలువ ఇలా..నీరు పారేదెలా..?



కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

ఏలేశ్వరం: వందలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న పట్టణంలోని ప్రధాన పంటకాలువ వ్యర్థాలతో నిండి అధ్వానంగా దర్శనమిస్తోంది. పట్టణంలో సుమారు కిలోమీటన్నర ఉన్న కాలువలో చెత్తపేరుకుపోయి ఖరీఫ్ సాగుకు దిగువ ప్రాంతాలకు నీరు అందడం లేదని పరిసరప్రాంత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువను అనుకుని దుకాణాలు, హోటల్స్, ఆసుపత్రుల్లోని చెత్తను కాలువలో వేస్తున్నారు. దీంతో దుర్గంధంతో పాటు కాలువ కుంచించుకుపోయింది. చెరువులో నీటినిల్వలు అంతంతమాత్రంగా ఉండడంతో నీటిసరాఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అట్లతద్దే

తొండంగి: మండలంలోని పలు గ్రామాల్లో అట్లతద్దే వేడుకలను ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలంతా గౌరీ దేవికి పూజలు చేపట్టారు. అనంతరం అట్లు, కుడుములు, పాలతాలికలు, పులిహోర వంటి వివిధ రకాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ముత్తైయిదువులకు వాయినాలు అందజేశారు. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు

కిర్లంపూడి: స్థానిక విజ్ఞాన భారతి పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆర్ఎస్ఎస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు హెగ్డే వార్, గురుజీ, భారతమాత చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అల్లు శివ రామకృష్ణ, రాసంశెట్టి రాజా, దొడ్డ అప్పారావు, యడాలి రాంబాబు తదితరులు ఉన్నారు.

ముగిసిన శరన్నవరాత్ర ఉత్సవాలు



శంఖవరంలో వాహనంపై ఊరేగుతున్న కనకదుర్గమ్మ వారు

శంఖవరం: స్థానిక యాదవపేటలో కనకదుర్గమ్మ శరన్నవరాత్ర ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ గ్రామ వీధుల్లో వైభవంగా ఊరేగించారు. అనంతరం గ్రామశివారులో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

కోటనందూరు: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం వైద్య సిబ్బందికి సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఆరోగ్య రంగంపై తీవ్ర ప్రభావం చూపి తక్కువ ధరకే పేదవాడికి వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. మెడికల్ షాపుల్లో మందుల దరలు కూడా తగ్గనున్నాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యన్నారాయణ, డీసీటీఓ మాధవి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ నిలిపివేత

కాకినాడ రూరల్: మండలంలో మూడు బాణసంచా తయారీ కేంద్రాలు ఉండగా కలెక్టరు ఆదేశాల మేరకు వాటిని తాత్కాలికంగా నిలిపివేసినట్లు రూరల్ తహసీల్దార్ కుమారి తెలియజేశారు. రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో చోటు చేసుకున్న ప్రమాదం నేపథ్యంలో భద్రతా చర్యలు తీసుకోవడంలో భాగంగా తాత్కాలికంగా తయారీ కేంద్రాలపై ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దీపావళి బాణసంచా తయారీ, విక్రయదారులు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలు జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం భారీగా ఉంటుందని రూరల్ తహసీల్దార్ కుమారి హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బాణసంచా తయారీ దారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రతి కార్మికుడికి రక్షణ కల్పించేలా తయారీదారులు తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కాకినాడ రూరల్: వచ్చే నెలలో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌ను పరీక్షలు నిర్వహిస్తున్నట్టు మెడికవర్ యూనిట్ హెడ్ శుభాకరరావు తెలియజేశారు. ఇందుకు సంబంధించి పోస్టరును ఆస్పత్రిలో డాక్టర్ అనురాగమయి, గీతాశ్రీ ఆవిష్కరించారు. ఏటా అక్టోబరు మాసంలో ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన నెలగా జరుపుకొంటామని శుభాకరర్ పేర్కొన్నారు. నెల రోజులు పాటు ఉచిత బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీని ప్రారంభించామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడి గ్రామంలోని శ్రీఅభయ ఆంజనేయస్వామి వారి ఆలయ అభివృద్ధికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రూ.1.25 లక్షల విరాళాన్ని అందజేశారు. గురువారం మండలంలోని పెదశంకర్లపూడి గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో ఆలయ నిర్మాణంలో భాగంగా గ్రానైట్ గానూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఈ మొత్తాన్ని ఆలయ కమిటి సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మిరియాల శ్రీను, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



కమిటి సభ్యులకు విరాళాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే